

# పుస్తక పరిచయం





**NADELLA ANURADHA**
Flat No.102, Block - D, Vasantha Nagar,
Poranki. VIJAYAWADA - 521137.
**Phone :** 0866 - 2583196, **Cell :** 73860 98516
tukusgm@gmail.com.



**Sole Distributors**
Visalaandhra Book House


**చక్కటి కథారచయిత్రిగా** తెలుగుపాఠకలోకానికి చిరపరిచితమైన నాదెళ్ళ అనూరాధగారి కలం నుంచి వెలువడిన విలక్షణమైన, విశిష్టమైన కథల సంపుటి ఈ 'గూడెం చెప్పిన కథలు'. దీన్ని కథా సంపుటి అనే కంటే అనుభవాల సంపుటి అంటేనే బావుంటుందేమో. రచయిత్రి ముందుమాటలో 'నాకెన్నో కథలు చెబుతున్న గూడెం చిన్నారులకు ప్రేమతో' అంటూ ఇలా చెప్పారు " పసి వయసులోనే ఇక్కడి పిల్లలు చూసే జీవితాన్ని చూస్తే మనసులో ముల్లు.. ఈ నేల, ఈ ఆకాశం, ఈ నీరు, ఈ ప్రకృతి అందరివీ కావా? బాల్యం కూడా అందరికీ కాదా? మొలత్రాడుకి ఇంటి తాళం భద్రంగా తగిలించుకుని, పుస్తకాల సంచీతో క్లాసుకొచ్చే నాలుగేళ్ళ పిల్లల్ని మీరు చూసేరా ఎప్పుడైనా?". ఈ పుస్తకంలోని అనుభవాల అక్షరీకరణలో ఇలాంటి పిల్లలని , వాళ్ళు చదువుకునే క్రమంలో ఎదురయ్యే అనుభవాలని మనసుకు హత్తుకునేలా వ్రాశారు అనూరాధగారు. సో కాల్డ్ నాగరిక సమాజంలోని పిల్లలకున్న సౌకర్యాల్లో, వెసులుబాటులో వందోవంతు కూడా లేని అండర్ ప్రివిలేజ్డ్ పిల్లల చదువులు ఎలా ఉంటాయో, వాళ్ళ సమస్యలు ఎలా ఉంటాయో కళ్ళకుకట్టినట్లు ఈ కథల్లో చెబుతారు ఒక టీచర్. అలా గూడెంలో పనిచేసే ఒక టీచర్ అనుభవాలు స్వీయకథనంలా సాగుతాయి. 50 పేజీల ఈ పుస్తకంలో 11 కథలు (కథానికలు) ఉన్నాయి. ఇవన్నీ సారంగ వెంబ్ మాగజైన్‌లో ధారావాహికంగా వచ్చాయి. బ్రతుకే పోరాటమైన గూడెంలో పిల్లలకి చదువుచెప్పడమంటే తనకి తెల్సిన విద్యని ప్రదర్శించడం కాదు, వాళ్ళ సమస్యలని అర్థం చేసుకుని వాటికీ పరిష్కారాలను చూపిస్తూ, చదువు విలువని తెలియచేస్తూ, విద్య నేర్పడం. ఇలా చేయడానికి టీచర్లకి చాలా ఓపిక, నేర్పు కావాలి. అలాంటి స్కూళ్ళకి పిల్లలని రప్పించడమే ఒక విద్య ఐతే, వచ్చిన వాళ్ళలో కూడా ఆడ పిల్లలూ - మొగపిల్లలూ వాళ్ళ మధ్య సమస్యలు, కాస్త మంకుపట్టు, ఇంకొంచెం రౌడీతనం ఇవన్నీ ఉన్న పిల్లలు - ఇలాంటి వాళ్ళని విద్యావంతుల్ని చేయడంలో ఎదురైన అనుభవాలు పాఠకులని  గూడెంలోకి తీసుకెళ్తాయి. ఇందులోని వివిధ సంఘటనలు గూడెంలోని ప్రజల జీవన విధానాలకి కూడా అద్దం పడతాయి. అందరికీ పరిచయంలేని ఒక కొత్త లోకాన్ని పాఠకులకి పరిచయం చేయడంలో కృతకృత్యులయ్యారు రచయిత్రి నాదెళ్ళ అనూరాధగారు.

***




**అరుదుగా** వ్రాసినా ఆలోచింపచేసే కథా వస్తువులతో, చదివించే శైలితో కథలు వ్రాస్తున్న రచయిత్రిగా జి.ఎస్.లక్ష్మిగారు తనకంటూ ఒక పేరు తెచ్చుకున్నారు. లక్ష్మిగారు వ్రాసిన కథల్లో ఇతివృత్తాలు ఎంతగా మనసులకి హత్తుకుంటాయో, ఆలోచింపచేస్తాయో - అలాంటి ఇతివృత్తంతో వారు వ్రాసిన తొలి నవల ఈ "ఒక ఇల్లాలి కథ". "స్త్రీ వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా ఆవిష్కరించిన సీరియల్" అనే టాగ్‌లైన్‌తో ఆంధ్రభూమి వారపత్రికలో 2007 సెప్టెంబర్ నుంచి 2008 జనవరి వరకూ సీరియల్‌గా ప్రచురించారు. కాస్త ఆలశ్యంగా క్రిందటి సంవత్సరమే ఈ నవల పుస్తకరూపంలో తెలుగుపాఠకలోకం ముందుకి వచ్చింది. ఈ నవల ఇంకా డ్రాఫ్ట్ స్థాయిలో ఉండగానే ప్రముఖ రచయిత వసుంధరగారు, ఈ నవలని పరిశీలించి, స్పందన తెలియచేస్తూ "ఒక గొప్ప నవలకు అద్భుతమైన ఇతివృత్తం. వాస్తవికతకు అద్దంపట్టే సంఘటనలు. సహజత్వాన్ని నిలుపుకున్న పాత్రలు, సంప్రదాయాన్ని సవాలు చేసే ప్రశ్నలు, హృదయాలను కదిలించే విశ్లేషణ ఉన్న రచన" అన్నారు. ఈ నవల చదివిన పాఠకులు ప్రతి ఒక్కరూ వసుంధరగారు వెలిబుచ్చిన అభిప్రాయాలతో ఏకీభవిస్తారు. నవల రచనా శైలి అతి సరళంగా సాఫీగా సాగింది. పాత్రలూ, వాటి వ్యక్తిత్వ చిత్రణా పాఠకులని కథా క్రమంలోకి తీసుకెళ్తాయి. పాత్రల మధ్య జరిగే సంభాషణలు, రచయిత్రి చెప్పే నెరేషన్ రెండింటినీ సమతూకంతో నడిపించారు. మొదటి నవలే ఐనా చాలా అనుభవమున్న నవలా రచయిత్రి వ్రాసినట్లే ఉంటుందీ నవల. భర్త మూర్ఖత్వానికి , తిరస్కారానికి గురైన మధ్యతరగతి మహిళ జీవితంలో జరిగిన సంఘటనలు, ప్రతికూల పరిస్థితులని ఎదుర్కొని ఆమె సాగించిన జీవన పోరాటం, నవల ముగింపులో ఆమె తీసుకున్న నిర్ణయం.. పాఠకులని ఏకబిగిన చదివిస్తాయి. ప్రధానపాత్ర యొక్క తండ్రి గురించి వివరించేప్పుడు భారత దేశ స్వాతంత్ర్యపోరాట సమయంలోని పరిస్థితులు, అప్పటి మధ్యతరగతి జీవితాల్లోని సన్నివేశాలు అతి సమర్థవంతంగా చిత్రించారు రచయిత్రి. ఇంటర్నెట్, సెల్‌ఫోన్, ఫేస్‌బుక్ ... ఈ నేపథ్యాలతో కథలూ, నవలలూ వస్తున్న ఈ కాలంలో చక్కటి సంప్రదాయబద్ధమైన కథాంశం, పాత్రలతో సాగే ఈ నవల పాఠకులకి గొప్ప రిలీఫ్‌ని ఇస్తుందనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

***

**Smt. G.S. Lakshmi**
2-2-23 / 7 / 1, Bagh Amberpet
Hyderabad - 500 013
Ph : 040 - 27425306
Cell : 990 864 8068
E-mail : slalita199@gmail.com

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI(Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**